క్లుప్తంగా

ఐక్యతతోనే 'కృతజ్ఞత సభ' సక్సెస్


కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య

కర్నూలు(అర్బన్): జిల్లాలో వాల్మీకి సామాజిక వర్గంలో ఉన్న ఐకమత్యం వల్లే ఈనెల 2వ తేదీన జరిగిన కృతజ్ఞత ర్యాలీ, సభ సక్సెస్ అయ్యిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా వాల్మీకులు ఎదురుచూస్తున్న కల నెరవేరబోతుందన్నారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తూ మార్చి 24న రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు చెప్పేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఊహించని రీతిలో వాల్మీకులు హాజరయ్యారన్నారు. ఓ వైపు ఎండలు మండుతున్నా జిల్లా నలుమూలల నుంచి స్వచ్ఛందంగా వాల్మీకులు వేల సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని, అందుకు సహకరించిన నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇంటెలిజెన్స్ సీఐ పవన్‌కిషోర్

కర్నూలు (టౌన్): స్థానిక సి.క్యాంపు ప్రార్థన మందిరం వద్ద సోమవారం గుంత విజయలక్ష్మి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఇంటెలిజెన్స్ సీఐ కె.పవన్‌కిషోర్ అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండే ఎండల్లో ప్రజల దాహార్తి తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. అంతకు ముందు ప్రార్థన మందిరం పాస్టర్ రెవరెండ్ కరుణసాగర్ పాల్గొని ప్రార్థన చేశారు.

పీఆర్ ఉద్యోగికి ఉగాది పురస్కారం


ఉగాది పురస్కారం అందుకుంటున్న గుర్రాల శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగి గుర్రాల శ్రీనివాసులుకు ఉగాది పురస్కారం లభించింది. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి రాష్ట్రస్థాయిలో విస్డమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 2వ తేదీన ఉగాది పురస్కారాలను అందించారు. పురస్కార గ్రహీత గుర్రాల శ్రీనివాసులు మాట్లాడుతూ.. సఫాయి కర్మచారుల సమస్యలపై చేస్తున్న సేవలకు అవార్డు లభించిందన్నారు. ఈ నేపథ్యంలోనే 2023 నంది పురస్కారంతో పాటు సర్టిఫికెట్ అందించినట్లు వెల్లడించారు.

అవార్డుల ప్రదానం

కర్నూలు కల్చరల్: బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ పేరిట వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి అవార్డులను సోమవారం బీజేపీ కార్యాలయంలో ప్రదానం చేశారు. మహిళా మోర్చా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అన్నపూర్ణ సేవా సమితి సభ్యురాలు మహాలక్ష్మి, మాతృశక్తి సంయోజక్ గౌరీ, ఆరోగ్య భారతి జిల్లా కార్యదర్శి స్వప్నలకు మహిళా మోర్చా అధ్యక్షురాలు మాలతి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహవర్మ అవార్డులు ప్రదానం చేశారు. మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి బండారే రేణుక, కార్యదర్శి సుజాత, కోశాధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు(లీగల్): ఢిల్లీ న్యాయవాది వీరేందర్ నర్వాల్‌పై కొందరు దుండగులు దాడి చేసి హత్య చేసినందుకు నిరసనగా కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం మంగళవారం తమ విధులను బహిష్కరించనున్నట్లు అధ్యక్షులు టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.వి.చక్రపాణి తెలిపారు. అలాగే రాజమండ్రిలో న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడాన్ని వారు ఖండించారు. వీరేందర్ నర్వాల్ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : దసరా, భోలా, దాస్ కా ధమ్కీ, బలగం
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : దసరా, సత్యం వధ ధర్మం చెర, పరారీ, డంజియన్స్ అండ్ డ్రాగన్స్ : హానర్ అమాంగ్ థీవ్స్, దాస్ కా ధమ్కీ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సర్, దాస్ కా ధమ్కీ
ఐనాక్స్ : భోలా, డంజియన్స్ అండ్ డ్రాగన్స్ : హానర్ అమాంగ్ థీవ్స్, జాన్ విక్ చాప్టర్-4
రాజ్ : వీరసింహారెడ్డి
శ్రీరామ : దసరా
విజయ : దసరా

మానవతకు నిర్వచనం..
ధర్మ సూత్రాలకు నెలవు

- ధర్మం, దాతృత్వం, అహింస మహావీరుని మార్గం
- జైనుల సేవా తత్పరత
- నేడు మహావీరుని జయంతి


జైన్ ఆలయం


భగవాన్ మహావీర్

కర్నూలు కల్చరల్: జీవితం చాలా విలువైనది. బతికినంత కాలం ఉత్తమ వ్యక్తులుగా జావించాలి. హింసకు దూరంగా ఉండాలి. ధర్మం, దాతృత్వం, సత్యం, సేవా భావం వంటి సద్గుణాలతో జీవనం సాగించాలని ప్రబోధించారు జైనుల 24వ తీర్థంకరుడు భగవాన్ మహావీర్. 2,622 సంవత్సరాల క్రితం జన్మించిన ఈయన తపస్సుతో ఆత్మ సాక్షాత్కారాన్ని పొంది జైనులకు ఆరాధ్య దైవంగా నిలిచారు. మంగళవారం 'మహావీర్' జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

అహింసను ప్రబోధించిన జైన గురువు వర్ధమాన మహావీరుడు జయంతిని ఏటా చైత్రమాసంలో ఘనంగా నిర్వహిస్తారు. బీహార్ రాష్ట్రం వైశాలి సమీపంలోని కుండ గ్రామంలో క్రీ.పూ.599లో క్షత్రియ కుటుంబంలో సిద్దార్థ, త్రిష రాజ దంపతులకు జన్మించిన ఈయన 36వ ఏట సన్యాసాన్ని స్వీకరించారు. 12 ఏళ్లపాటు తపస్సు చేసి జైన మత ప్రచారకుడు అయ్యారు. అప్పటికే జైన మతానికి 23 మంది తీర్థంకరులు ఉండగా మహావీర్ 24వ తీర్థంకరునిగా ప్రచారం చేశారు. 39 ఏళ్ల పాటు అహింసా ధర్మాన్ని ప్రచారం చేసిన ఈయన 72వ యేట పరమదించారు.

400 కుటుంబాలు.. 1800 మంది జనాభా

సుమారు వందేళ్ల క్రితం రాజస్థాన్ నుంచి వచ్చిన పలువురు జైనులు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ముఖ్యంగా కర్నూలు నగరం, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో సుమారు 400 కుటుంబాలు ఉండగా జనాభా పరంగా 1800 మంది వరకు ఉంటారని అంచనా.

నేడు జరిగే వేడుకలు ఇలా..

శ్రీ జైన్ శ్వేతాంబర్ ముర్తి పూజక్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం భగవాన్ మహావీర్ జయంతి వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఓల్డ్‌సిటీలోని జైన్ ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 6 గంటలకు భక్తాంబర్, 8 గంటలకు ఓల్డ్‌సిటీలోని జైన్ ఆలయం నుంచి మహావీర్ చౌక్ వరకు మహావీరుని చిత్రపటంతో రథం ఊరేగింపు నిర్వహించనున్నారు. అనంతరం నగర శివారులోని గోశాలలో అన్ని జైన్ కుటుంబాలు గోపూజ, గోవులకు గ్రాసం పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం పుల్లూరులోని మహావీర్ ధామ్‌లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు జరుగుతాయి. సాయంత్రం జైన్ ఆలయంలో పూజ, భక్తి సంధ్యా కార్యక్రమాలు ఉంటాయి.

మహావీరుడు ప్రబోధనల్లో ముఖ్యమైనవి

- ధర్మం మహా పవిత్రమైంది. అహింస, స్వీయ నియంత్రణ, పవిత్రత ధర్మంలో భాగాలు.
- కోపం, గర్వం, మోసం, ఆశ మానవునకు నాలుగు శత్రువులు. క్షమతో కోపాన్ని జయించాలి. వినయంతో గర్వాన్ని అణచివేయాలి. సామ్యంతో మోసాన్ని జయించాలి. తృప్తితో ఆశను తొలగించాలి.
- స్వప్రయత్నం ద్వారా ప్రతి మానవునిలో ఆత్మోద్ధారణ సాధ్యం.
- కర్మ ఫలాలను ప్రాణులంతా అనుభవించక తప్పదు.
- సదా సత్యాన్ని పలకాలి. దొంగతనం, అశుద్ధి నుంచి దూరంగా ఉండాలి.
- మత్తు పదార్థాల సేవనం, జూదం, మాంస భక్షణం పతనం వైపు లాగుతాయి.
- సర్వజీవుల పట్ల స్నేహంగా మెలగాలి.
- కోరికలను అదుపులో పెట్టుకోవాలి. శీల సంపదలేని మానవ జీవితం వృథా.
- కులం, వర్గం లింగ భేదం, భాష ప్రాంత భేదాలు పాటించ కుండా 'మానవులంతా ఒక్కటే' అనేలా మెలగాలి.
- నిస్సహాయులైన వారికి సాయం చేయాలి. ఆపదలో ఉన్న వారిని, అవసరార్థులను ఆదుకోవాలి. రోగులకు సేవ చేయాలి.

జైనుల సేవాతత్పరత

- కర్నూలు నగర శివారు వీకర్ సెక్షన్ కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్నారు.
- జిల్లా గో రక్షణశాల అభివృద్ధికి సుమారు 120 మంది జైనులు నెలకు రూ.500 చొప్పున రూ.60 వేలు వితరణ చేస్తున్నారు.
- నెలలో ఒక శనివారం 1200 మందికి అన్నదానం చేస్తారు
- 800 మందితో రక్తదాతల జాబితా తయారు చేసి ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తున్నారు.
- అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు నిరంతరం సాయం అందిస్తున్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతోష్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చుతున్న కారణంగా బాలాజీ నగర్, ఎన్‌హెచ్-44, బావాపురం, జి.శింగవరం, నిడ్జూరు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన వినియోగదారులు తమ సమస్యలను సెల్ 73826 14308 నంబరుకు ఫోన్ చేసి చెప్పుకొని పరిష్కారం పొందవచ్చని వెల్లడించారు.

జీతాలు చెల్లించండి

కర్నూలు(అర్బన్): జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న దినసరి కూలీలకు జీతాలు చెల్లించాలని టీఎస్ఎఫ్ నేతలు కోరారు. సోమవారం టీఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కే.అక్కులప్ప, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప విజయవాడలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జాహ్నవిని కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఆయా విద్యాలయాల్లో మొత్తం 65 మంది దినసరి కూలీలుగా (కుక్, కామాటీ, వాచ్‌మెన్లుగా) నెలకు రూ.4,500 వేతనం ప్రకారం పని చేస్తున్నారన్నారు. వీరికి గతేడాది జూన్ నుంచి వేతనాలు అందలేదని వెంటనే మంజూరు చేయాలని కోరారు.

కర్నూలు డీసీసీబీ ఘనత


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ మహాలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) బలమైన బ్యాంకుగా ఆవిర్భవించిందని చైర్‌పర్సన్ ఎస్.మహాలక్ష్మి వెల్లడించారు. కర్నూలు డీసీసీబీని బలమైన బ్యాంకుగా నాబార్డు, ఆప్కాబ్ సంయుక్తంగా ప్రకటించడం శుభపరిణామమని, సమష్టిగా పనిచేయడం వల్ల ఇది సాధ్యమైందన్నారు. సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ల సమావేశంలో చైర్‌పర్సన్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం బ్యాంకు ప్రగతిని వివరించారు. కేడీసీసీబీ సీఆర్ఏఆర్ 12 శాతం, నిరర్థక ఆస్తులు ఎన్‌పీఏ కేవలం 4.65 శాతం ఉన్నాయని వివరించారు. పాత నష్టాలను అధిగమించి రూ.3.05 కోట్ల నికరాదాయం పొందినట్లు పేర్కొన్నారు. రూ.3500 కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలోనే 5వ అతి పెద్ద బ్యాంకుగా అవతరించిందన్నారు. 2023-24లో టర్నోవర్‌ను రూ.4500 కోట్లకు పెంచి ఏ-క్లాస్‌గా బ్యాంకుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. త్వరలో సంజామల, గడివేముల, మాధవరంలలో కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ శాతం పెంచినట్లు తెలిపారు. డీసీసీబీ సీఈఓ పి.రామాంజనేయులు మాట్లాడారు. పాలకవర్గం సభ్యులు గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, సీమ సుధాకర్ రెడ్డి, వెంకటరముణా రెడ్డి, డీజీఎంలు ఉమామహేశ్వరర రెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించండి


విద్యార్థులతో మాట్లాడుతున్న సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు రాకుండా చూసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఆయన నగరంలోని డాక్టర్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, బీ క్యాంప్‌లోని బీసీ, డీఎస్టీ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా వసతి గృహాల్లోని విద్యార్థులకు అందుతున్న వసతులు, పాటిస్తున్న మెనూ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డీఎస్టీ వసతి గృహ సంక్షేమాధికారి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఢిల్లీకి తరలివెళ్లిన కార్మిక సంఘాలు

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో చేపట్టిన కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లా నుంచి కార్మిక, కర్షక నాయకులు తరలివెళ్లారు. కార్మిక కర్షక భవన్ నుంచి ఒక గ్రూపు, ఓల్డ్‌సిటీ నుంచి మరో గ్రూపు ప్రదర్శనగా రైల్వేస్టేషన్ చేరుకున్నాయి. వారికి సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నాయకులు పీఎస్‌రాధాకృష్ణ, బి.రామాంజనేయులు బీడ్కోలు పలికి సాగనంపారు.

ఆలయ భూములను పరిరక్షించాలి

కర్నూలు(సెంట్రల్): పత్తికొండలోని పలు దేవాలయాలకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ డిమాండ్ చేశారు. సోమవారం వీహెచ్‌పీఆ ధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పత్తికొండలో కబ్జాకు గురైన దేవదాయ ధర్మదాయ శాఖ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. నాయకులు సుబ్రమణ్యం, మాలిగి భానుప్రకాష్, వీర్రాజులు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

గూడూరు రూరల్: కే.నాగులాపురం పోలీస్ స్టేషన్‌లో యువకుడి మిస్సింగ్ కేసు నమోదైనట్లు సోమవారం ఎస్ఐ సోమ్లానాయక్ తెలిపారు. వివరాలు.. పర్ల గ్రామానికి చెందిన కురువ నారాయణ కుమారుడు బండారి సురేష్ (34) గత నెల 23న కారు (ఏపీ 26 ఏడబ్ల్యూ1583)లో ఇంటి నుంచి బెంగళూరుకు ఇంటర్వ్యూ నిమిత్తం వెళ్లాడు. గత నెల 30వ తేదీ వరకు ఫోన్‌లో మాట్లాడాడు. ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. ఇంతవరకు ఇంటికి రాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

పాణ్యం: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పెట్రోలింగ్ సిబ్బంది సోమవారం తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన బాలకృష్ణ బైక్‌పై వస్తుండగా ఎదురుగా నంద్యాల వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో అతని కాలికి తీవ్ర గాయమైంది. అక్కడున్న వారు చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. హైవే అధికారులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

ఆటిజంపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డాక్టర్ విజయ్ ఆనంద్‌బాబు

కర్నూలు(హాస్పిటల్): ఆటిజంతో బాధపడుతున్న చిన్నారులను ఓ కంట కనిపెడుతూ ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయ్ ఆనంద్‌బాబు సూచించారు. సోమవారం ఆసుపత్రిలోని డైస్ కేంద్రంలో ప్రపంచ ఆటిజం(జన్యుపరమైన లోపం) దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ విజయ్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఆటిజం జన్యుపరమైన లోపం అని, ఎదుగుదల లోపం వల్ల పిల్లల ప్రవర్తనలో మార్పులు వస్తాయన్నారు. ఇతర పిల్లలతో కలిసి ఉండకపోవడం, ఒంటరిగా ఉండటం, మాటలు ఆలస్యంగా రావడం, ఒకే పనిని పదే పదే చేయడం ఉంటుందన్నారు. ఇలాంటి పిల్లలను చిన్నప్పటి నుంచే గమనిస్తూ ఉండాలని సూచించారు. మానసిక విభాగాధిపతి డాక్టర్ ఇక్రముల్లా మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను మూడేళ్లలోపు గుర్తించి తగిన చికిత్స అందిస్తే అభివృద్ధి ఉంటుందన్నారు. ఐఏపీ సెక్రటరీ డాక్టర్ రత్నాకర్‌రెడ్డి, రాష్ట్రీయ బాల స్వస్థ్య అధికారిణి హేమలత మాట్లాడుతూ పిల్లల పరిస్థితికి అనుగుణంగా స్పీచ్ థెరపీ, ఫిజికల్ థెరపీని ఆస్పత్రిలోని డైస్ కేంద్రంలో ఉచితంగా కల్పిస్తారని చెప్పారు. డాక్టర్లు లక్ష్మీనారాయణ, ఆనంద్ ప్రకాష్, కృష్ణ, అపరంజి, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద అంబులెన్స్‌లను తొలగించండి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల బయట ప్రధాన రహదారిపై నిలిపి ఉన్న ప్రైవేటు అంబులెన్స్‌లను అక్కడినుంచి తొలగించేందుకు సహకరించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డిని నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రమాదేవి కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డిని ఆయన ఛాంబర్‌లో కలిసి సమస్యపై చర్చించారు. ఆసుపత్రి ప్రధాన రహదారిపై 20కి పైగా ప్రైవేటు అంబులెన్స్‌లు నిలిపి ఉంచుతున్నారని, వీటి వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. కొన్నిసార్లు గంటల తరబడి మృతదేహాలను అంబులెన్స్‌లోనే ఉంచేస్తున్నారన్నారు. వీటిని ఆసుపత్రి ఆవరణలో ఉంచేందుకు అనుమతించాలని కోరగా అలాంటి అనుమతులు ఇవ్వడానికి వీలు కాదని చెప్పారు. గతంలో ఆసుపత్రిలో ఉన్న అంబులెన్స్‌లను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బయటకు పంపించామని, అక్కడున్న అంబులెన్స్‌లను తొలగించాల్సిన బాధ్యత పోలీసులు, మున్సిపల్ అధికారులు చూసుకోవాలని సూచించారు.

కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు (సిటీ): జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమించి ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయని, ఆయా కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టికి వినతిపత్రం ఇచ్చారు. ఆయా సంఘాల నాయకులు రాజేష్, ఓంకార్, ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు, ఐఐటీ, జేఈఈ, నీట్ పేర్లతో అడ్డగోలుగా ఫీజులు నిర్ణయించి ముందస్తుగానే అడ్మిషన్లు చేసుకుంటున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేస్తున్న కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఐఎన్‌టీయూసీ నుంచి తొలగింపు

కర్నూల(సెంట్రల్): ఐఎన్‌టీయూసీ నుంచి జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న ఎం.సుంకన్నను తొలగించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బతుకన్న తెలిపారు. సోమవారం డీసీసీ కార్యాయంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఎం.సుంకన్న సంఘం నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా మాట్లాడడంతో ఏప్రిల్ 2వతేదీ లోపు సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. ఆయన నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో సభ్యత్వం నుంచి తొలగించినట్లు చెప్పారు. ఇక నుంచి జిల్లా కార్యదర్శిగా మహేష్ వ్యవహరించనున్నట్లు చెప్పారు.

ప్రసన్నకుమార్ సేవలు ఎనలేనివి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ శాఖ టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసిన ప్రసన్నకుమార్ సేవలు ఎనలేనివని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. ప్రసన్నకుమార్ ఇక్కడ పనిచేస్తూ ఇటీవలే నెల్లూరు జిల్లా నాయుడుపేటకు బదిలీ అయ్యారు. దీంతో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల పట్ల ఎంతో అంకిత భావం కలిగి పనిచేశారని కొనియాడారు. డీఈలు సుధాకర్ కుమార్, నాగేశ్వరరావు, ప్రసాదరెడ్డి, రమేష్, ఏడీఈలు విజయభాస్కర్, రాజమోహన్‌రెడ్డి, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

స్పందనతో సత్వర పరిష్కారం


దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించాలని విన్నవిస్తున్న వ్యాపారులు

కర్నూలు (టౌన్): స్పందన కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపుతామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం స్థానిక నగర పాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ కాలనీ వాసులు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందిగా ఉండటంతో రెండు రోజుల క్రితం బంకులను తొలగించారు. వారంతా కమిషనర్‌ను కలిసి దుకాణాల ఏర్పాటుకు అనుమతించాలని కోరగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, మరోసారి వేస్తే తొలగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మున్సిపల్ ఇంజినీర్ శేషసాయి, ఆరోగ్య శాఖ అధికారి విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

సమస్యలివే..

- తమ కాలనీలో పార్కు స్థలం ఆక్రమించారని ఇంజినీర్స్ కాలనీకి చెందిన లక్ష్మన్న బాబు విన్నవించారు.
- తమ కాలనీలో డ్రైనేజా ఏర్పాటు చేయాలని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన సతీష్‌కుమార్, సోమిశెట్టి నగర్‌కు చెందిన పద్మ విన్నవించారు.
- మంచినీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని పార్థసారథి నగర్‌కు చెందిన శ్రీనివాసులు కమిషనర్ దృష్టికి తెచ్చారు.
- తమ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలకు మరమ్మతులు చేయాలని లెక్చరర్ కాలనీకి చెందిన పోతురాజు కోరారు.
- టిడ్కో ఇంటికి కట్టిన రుణాన్ని వాపస్ ఇవ్వాలని గణేష్‌నగర్‌కు చెందిన జయన్న, పోస్టల్ కాలనీకి చెందిన హాఫీజా విన్నవించారు.
- తమ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు గురు రాఘవేంద్ర నగర్‌కు చెందిన పుల్లారెడ్డి విన్నవించారు.

అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలి


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో ఎస్వీనాగేశ్వరరావు, అధికారులు

కర్నూలు(సెంట్రల్): స్పందనలో ప్రజలు లేవనెత్తిన సమస్యలను అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డీఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, అనురాధ, రమ అర్జీలను స్వీకరించారు. డీఆర్వో మాట్లాడుతూ.. స్పందనలో వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలోపు పరిష్కరించాలన్నారు. ఏ అర్జీ కూడా రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు.

స్పందనలో వచ్చిన వినతుల్లో కొన్ని...

- సర్వే నంబర్ 257/5లో రామలింగేశ్వరస్వామి దేవస్థానం భూమి 17.04 ఎకరాల్లో ఫంక్షన్ హాలు నిర్మాణం కోసం కొంత స్థలం కేటాయించాలని మంత్రాలయంకు చెందిన చంద్రన్నగౌడ్, మల్లికార్జున, బసవరాజు, కుమారస్వామి విన్నవించారు.
- ప్రభుత్వ పొరంబోకు భూమిని శ్మశానానికి కేటాయించాలని పత్తికొండ మండలం నలకదొడ్డి హనుమంతు, హుస్సేన్‌మియ్యా, రవికుమార్ అర్జీ ఇచ్చారు.
- తాను 1998లో సర్వేనంబర్ 505/1లో ఎకరా పొలం కొన్నానని, ఆన్‌లైన్‌లో తన పేరిట నమోదు చేయాలని ఓర్వకల్ మండలం ఎన్.కొంతలపాడుకు చెందిన మాదిగ నాగమద్దిలేటి కోరారు.
- సర్వే నంబర్ 1226/1లో తనకు 1.10 ఎకరాల భూమి ఉందని, అది రికార్డుల్లో చుక్కల భూమిగా నమోదైందని, ఆ జాబితా నుంచి తొలగించాలని వెల్దుర్తికి చెందిన ఏ.మల్లయ్య అభ్యర్థించారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య


కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఐ నరసింహులు

కర్నూలు: భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెంది కర్నూలు పాతబస్తీలోని తెలుగు వీధిలో నివాసముంటున్న తెలుగు కుమార్ (37) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. కుమార్‌కు జోహరాపురానికి చెందిన దేవికతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. గుండెజబ్బుతో పాటు మధుమేహ వ్యాధితో తీవ్రంగా బాధ పడుతున్న కుమార్ పని చేయలేని పరిస్థితిలో ఇంటి దగ్గరే ఉండేవాడు. కుటుంబ పోషణ భారమై భార్య మూడేళ్ల క్రితం పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. అప్పటినుంచి తల్లి వరలక్ష్మితో ఉంటూ ఆమెకు వచ్చే పింఛన్‌తో జీవనం సాగిస్తున్నారు. ఇటీవల మధుమేహ వ్యాధి తీవ్రం కావడం, ఎన్నిసార్లు పిలిచినా భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత తల్లి వరలక్ష్మి, చెల్లెలు రేణుక గమనించి ఇరుగుపొరుగు సాయంతో కిందకు దించగా అప్పటికే మృతిచెందాడు. ఘటనపై తల్లి వరలక్ష్మి సోమవారం ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులుగా గుర్తించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఆయాలను కార్మికులుగా గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆయాలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయాలకు జీఓ నంబర్ 108ని వర్తింపజేసి రూ.11,500 జీతం ఇవ్వాలన్నారు.

నోటిఫికేషన్లు విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): తక్షణమే మెగా డీఎస్సీ, గ్రూపు-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లను జారీ చేయాలని డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ డిమాండ్ చేశాయి. సోమవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేయగా, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.